ఇంతకన్నా ఏంకావాలి?

ఒక చంకలో పిల్లాణ్నెత్తుకుని, మరో చంకకు చేతి సంచిని తగిలించుకుని నడుస్తున్న వేణూ "ఒరేయ్ నరేష్! అని అరుస్తుంటే 'ఎవ రబ్బా' అని తిరగిచూశాడు నరేష్! ఆశ్చర్యం, ఆనందం ఒక్కసారిగా ముంచుకురాగా "ఒరేయ్! నువ్వా!" అంటూ గబగబా నడిచాడు నరేష్, వాళ్ళ అరుపులు అందరూ వింటున్నారని గాని, అందరూ అటే చూస్తున్నారని గాని అనుకోకుండా.

"ఒరేయ్! నువ్వు పెళ్ళి చేసుకున్నావా?" నరేష్, వేణూ నడిగిన మొదటి ప్రశ్న.

"వీడు మా సుపుత్రుడోయ్! నాన్నా టెంకూ అంకుల్‌కి నమస్కారం పెట్టు" అన్నాడు చంకలోని పిల్లాణ్ణి చూపిస్తూ వేణు.

వాడు నోట్లో వేలేసుకుని "ఊ..." అంటూ తల అడ్డంగా తిప్పాడు.

"సర్లే! ఏదీ మీ ఆవిడ?" అన్నాడు నరేష్ ఆవిడ్ని చూడాలన్న ఆత్రాన్ని మాటల్లోనే ప్రదర్శిస్తూ.

అతనంత క్యూరియాసిటీతో అడగడం చూసి వాళ్ళావిడ మొహం చిట్లించుకుంది.

"మా ఆవిడ ఇంటిదగ్గరుందిరా! పద మా ఇంటికి పోదాం" అన్నాడు వేణు.

"మరోసారొస్తాం" అంది నరేష్ భార్య సుమతి విసుక్కుంటూ.

"కాదు ఇప్పుడే వెళ్దాం" అంటూ ఆమె సమాధానానికైనా ఎదురుచూడకుండా వెళ్తున్న భర్తని చూస్తే ఒళ్ళు మండింది ఆమెకు.

"ఊక్కాదూ, మరోసారి ... అని చెబుతూంటే? అసలు మన ... పనిమీద బయల్దేరామో మర్చిపోయారా?" అడిగింది ఆమె. నరేష్ ఏదీ వినిపించుకోవడం లేదు. గబగబా నడిచివెళ్ళి "ఎలా వుంటుందిరా మీ ఆవిడ" అడిగాడు. సుమతికి ఒళ్ళు మండు కొచ్చింది.

"ఏమండి? కూరల సంచీ బరువుగా వుంది. ఇంకా మనం జనరల్ బజారుకెళ్ళాలి, మరోసారి వెళ్దామ్లె పదండి" అంది.

"అహఁ! అలాక్కాదు నువ్వు రిక్షాలో ఇవన్నీ వేసుకుని ఇంటికెళ్ళిపో. నేను వీడితో వెళ్ళొస్తాను" అంటూ ఆమె సమాధానం కోసం ఎదురుచూడకుండా వేణూ వెంట నడిచి వెళ్ళిపోయాడు నరేష్. సుమతికి కోపం, దుఃఖం ముంచుకొచ్చాయి. చేసేది లేక ఉస్సూరంటూ రిక్షా ఎక్కింది సుమతి.

* * *

వేణూకి అప్పటికి పంథొమ్మిదోసారి పిల్లని చూడడానికి వెళ్ళడం. వేణూ పెళ్ళిచూపులు అంటే అందరికీ వేళాకోళమైపోయింది చివరకు. ఏ పిల్లని చూడ్డానికెళ్ళినా తిరి గొచ్చాక "ఎలా వుందిరా అమ్మాయి? నచ్చిందా?" అంటే చట్టిముక్కు వుందనో, పిల్లి కళ్ళున్నాయనో, లావుగా వుందనో, మరీ సన్నగా వుందనో, లేకపోతే నల్లగా వుందనో ఏవో వంకలు చెప్పేవాడు. కాకపోతే పంథొమ్మిదిసార్లూ వెళ్ళిన చోటల్లా వాళ్ళు పెట్టిన టిఫెన్లూ, కాఫీ పుచ్చుకునొచ్చేవాడు.

"వీడికి జన్మలో పెళ్ళి కాదు" అనేవారు వాళ్ళ స్నేహ బృందం.

"ఒరేయ్! ఇంతమందిని చూశావు కదా, నీకు ఒక్కరూ నచ్చలేదా? ఒక పని చెయ్యి కూడదూ? నీకు కావలసిన పిల్ల ఎలా వుండాలో ఒక బొమ్మ గీసి చూపించు. పేపర్లో ప్రకటిద్దాం.

ఆ ప్రకటనకొచ్చిన సమాధానాన్ని చూసి, అప్పుడు ఏ పిల్లని చూడాలో నిశ్చయించుకోవచ్చు. ఏమంటావ్?" అన్నాడు వేణూ క్లాస్ మేటూ, క్లోజ్ ఫ్రెండూ అయిన నరేష్.

"అది కాదు గాని, జోక్స్ ఎపార్ట్, అసలు నీకు కావలసిన పిల్ల ఎలా వుండాలో చెప్పు! మేము రేపటినుంచే అటువంటి అమ్మాయి కోసం అన్వేషణ ప్రారంభిస్తాం" అన్నాడు శ్రీధర్.

"చాలా అందంగా వుండాలి. ఆమెలో ఏ వంకా వెతికినా కనిపించకూడదు" అన్నాడు వేణూ.

"తెల్లగా వుండాలి. భానుప్రియ లాంటి పెద్ద పెద్ద కళ్ళు, జయసుధలాంటి మొహమూ, జయప్రదలాంటి మూతీ, సుహాసినిలా నవ్వడం, సుమలత లాంటి ఫిగరూ, శ్రీదేవిలాంటి ముక్కూ..." ఇంకా ఏదో చెప్పబోతున్న వినోద్ మాటలకు అడ్డొచ్చి "ఒరేయ్! ఆపరా! అయితే వాడికీ జన్మలో పెళ్ళి కాదు. అనవసరంగా పిల్లల్ని చూడొద్దను. మేమూ ఆ ప్రయత్నం మాను కుంటాం" అన్నారూ మిత్రులు. వేణూ నిట్టూర్చాడు. జాలిగా చూశాడు ఫ్రెండ్స్ వంక 'అంతేనంటారా?' అన్నట్టు.

"కాకపోతే ఏమిట్రా? పులిహోరలాగా పుల్లగా, బిరియానీలాగా ఘాటుగా, సాంబార్ సాలడ్‌లాగా కమ్మగా అన్నీ కలిసినట్టుండే 'డిష్' తయారుచేసి తెమ్మంటే ఏం చేస్తాడు ఆ వంటవాడు? నిన్ను చూసి పిచ్చివాడివను కుని నవ్వుకుంటాడు. అట్టాంటిదేదీ లేదు పొమ్మంటాడు.

అమ్మాయి చూడగానే కళగా, లక్షణంగా వుండాలి అని కోరుకుంటే అర్థం వుంది కాని ఇదేం అభిరుచిరా? పైగా నా దృష్టిలో ఈ రూపాలకన్నా గుణానికి ఎక్కువ ప్రాముఖ్యత నిస్తే బావుంటుంది. అమ్మాయి చదువూ, సంస్కారం ఇలాంటివి ముందు చూసి, ఆ తరువాత మనకు అనుకూలవతి అవునా, కాదా అని చూసి, ఆ తరువాత అందచందాల గురించి ఆలోచిస్తే బాగుంటుంది."

అంతేకాని నువ్వు చెప్పిన ఆ హీరోయిన్ల మిక్చర్ సూపర్ హీరోయిన్ లాంటి అమ్మాయి రూపం చూసి తృప్తిపడిపోతావా? అయితే సినీ నిర్మాతలు "అందమైన అమ్మాయిలు కావలెను. మా రాబోయేచిత్రం లో నటించడానికి" అని ప్రకటించినట్టు 'అందమైన అమ్మాయి కావలెను నేను పెళ్ళి చేసుకోవడానికి' అని చెప్పి నీకు కావలసిన పిల్ల ఎలా వుండాలో రాసి ప్రకటించు' అన్నాడు అందరిలోకీ కాస్త పెద్ద తరహాగా ప్రవర్తించే ప్రకాశ్. వేణూ మొహం కోపంతో జేవు రించింది. "ఒరేయ్! చదువు లేకపోయినా ఫరవా లేదు. నాకు కాబోయే భార్య సంపా దించి నన్నుపోషించనక్కరలేదు. సంస్కారం, నేను చేసుకున్నాక నేనే నేర్పించుకోగలను. అంతే గాని ఒక కురూపిని కట్టుకునిరోజంతా ఆమె మొహం చూసి భరించలేనురా. డెఫి నెట్‌గా నాకు అందమైన భార్యే కావాలి!" అన్నాడు ఖచ్చితంగా, సీరియస్‌గా.

"అతడి వింత ఆలోచనలకి ఆశ్చర్య పోయినా 'మనకెందుకులే' అని ఊరుకున్నా రంతా.

వరసగా నాలుగు క్యాలెండర్లు మారాయి. బి.ఇ పూర్తయి పోవడం వల్ల తలోకరు తలొక ఊరుకెళ్ళిపోయారు ఉద్యోగరీత్యా. చాలా మందికి పెళ్ళిళ్ళయిపోయాయి, కొందరికి పిల్ల లు కూడా పుట్టేశారు.

వేణూకి మాత్రం అతనికి నచ్చిన పిల్ల దొరక లేదు సరికదా అసలు సంబంధాలే రావడం మానేశాయి.

"ఆ... అతడా? అతడికో తమాషా. ప్రతి పిల్లని చూడ్డం, నచ్చలేదని చెప్పడం' అన్న వార్త బాగా ప్రచారమై పోయింది.

వేణూకి దిగులు పట్టుకుంది తనకింక పెళ్ళి కాదేమోనని.

తల్లో తెల్లవెంట్రుకలు రావడం మొదలు పెట్టాయి. ముదిరిన బ్రహ్మచారికి ఆనవాలు గా నిలిచాయి

క్రమేణా అందరూ మరిచి పోయారు వేణూ పెళ్ళి గురించి. మాట్లాడడం మానే శారు. ఒకటి రెండు నిజంగా చాలా అంద మైన పిల్లల సంబంధాలే వచ్చాయని, వాళ్ళ వీడిని చూసి "అసహ్యంగా వున్నాడు మాకొద్దు" అంటూ వెళ్ళి పోయారని రాశాడు. ఆ తరువాత వినోద్‌కి కూడా ఆవూరి నుంచి ట్రాన్స్‌ఫర్ అవడం వల్ల మరి ఉత్తరాలు రాయలేదు. వేణూ సంగ తులేమీ తెలీలేదు నరేష్‌కి.

ఇంట్లో కాలు పెడుతూనే "మోహినీ.. మోహినీ.. రెండు కప్పులు కాఫీ పట్టుకురా. నా క్లాస్‌మేటు, క్లోజ్ ఫ్రెండ్ నరేష్ వొచ్చాడు" అంటూ "కూర్చోరా" అని కుర్చీ చూపించాడు. టెంకూని చంక లోంచి దింపుతూ.

"ఊ..." అంటూ లోపలి నుంచి వచ్చిన సమాధానానికి తిరిగి చూశాడు నరేష్. ఆమె కనిపించ లేదు. నరేష్ ఆతృత పట్ట లేక పోతున్నాడు. ఓ అయిదు నిముషాలయ్యాక ఆమె ట్రేలో రెండు కాఫీ కప్పులతో ప్రత్యక్ష మయింది. "నమస్కార మండి" అంటూ లేచాడు నరేష్. బాగానే వుందని పించింది ఆమెను చూడగానే. "అది మా పని మనిషిరా!" అన్నాడు మెల్లగా వేణూ. "ఉండూ! ఆమెను పిలుచుకు వస్తా" అని లోపలి కెళ్ళాడు. నరేష్‌కి గుండె ఆగి పోయినట్టని పించింది. పనిమనిషే ఇంత బాగుందే. ఆవి డెంత బాగుండాలి? వీడి టేస్టు గొప్పదే! మొత్తానికి అనుకున్నది సాధించాడు అను కుంటూ కాఫీతాగడం పూర్తి చేసి కప్పు టేబిల్ మీద పెడుతుండగా ఆమె వొచ్చింది వేణూ వెనకాలే నడుస్తూ.

నరేష్ గుండె ఆగిపోయినట్టయింది. నాలిక పిడచ కట్టుకుపోయి, గొంతు తడారి పోయి నట్టయింది. తన కళ్ళని తానే నమ్మలేక, కళ్ళుమరింత పెద్దవి చేసి చూశాడు. తారు నలుపు రంగూ, పళ్ళు ఎత్తు. చిప్ప కళ్ళు....

"నమస్కారం" అన్నాడు ఎలాగో తేరు కుని. ఆమె నిర్లక్ష్యంగా నమస్కారం పెట్టింది. నరేష్ మనసు చివుక్కుమంది. కాస్సేపు కూర్చుని లేచాడు "వెళ్ళొస్తానా" అని.

వేణూ కళ్ళలోని నీటి పొర చూసి ఆశ్చ ర్యంగా "ఏమిటిది? ఎందుకు?" అన్నాడు ఆప్యాయంగా భుజం నిమురుతూ.

"నిన్ను భోజనానికి కూడా పిలవ లేని అసమర్థుడిని. లక్ష రూపాయలకి ఆమెకు అమ్ముడు పోయిన బానిసని." కళ్ళు తుడుచు కున్నాడు వేణు. నరేష్‌కి జాలేసింది. ఏదీ బలీయం అన్నాడు. 'కాదు, ఇది నా మూర్ఖ త్వం. ఎవరెన్ని చెప్పినా అర్థం లేని ఊహాలతో చేతికందిన అవకాశాలన్నింటినీ కాదని కాల దన్ను కున్నాను. జీవితంలో కొంత రాజీ పడడం అవసరమనీ, కొంత త్యాగం, కొంత నేర్పూ, కొంత ఓర్పూ అవసరమని గ్రహించ లేకపోయాను. నాకింక పెళ్ళి కాదన్న దిగులు తో అమ్మ మంచం పడితే ఏదో ఒక పిల్లను చూసి కట్టేయ్యాలన్న నాన్నగారి పట్టుదలకి, మోహినికి వరుడు దొరక్క వాళ్ళు విచారిస్తు న్న సమయం కలిసొచ్చింది. దానికి తోడు లక్ష రూపాయల కట్నం అందరి కళ్ళూ మూసే సింది. చావు బతుకుల్లో వున్న అమ్మచేత అక్షింతలు వేయించుకుని ఓ ఇంటి వాడయ్యా నన్న తృప్తితో ఆమె మరణించడానికి తోడ్ప డ్డాను. 'కట్టుకున్నదానికి ఎప్పుడూ అన్యా యం చెయ్యను. కట్టుకున్న దానికి ఎప్పుడూ కష్టం రానీయను" అని అమ్మ కిచ్చిన మాట నిలుపుకుంటూ కాలం గడుపు తున్నాను. దుఃఖంతో మాట్లాడ లేక పోయాడు.

"పోనీ ఈమె గుణవంతురాలేనా?"

"చూశావుగా! డబ్బుతో వొచ్చానని వచ్చేంత గర్వం. గడ్డిపోచకన్నా హీనంగా తీసి పారేస్తుంది నన్ను. ఏమన్నా అంటే నిన్ను లక్ష రూపాయలతో కొనుక్కున్నాను జాగ్రత్త" అని మాటలతో హింసిస్తుంది. ఒరేయ్! గొంతెమ్మ కోరికలకి పోయి, అర్థం లేని పిచ్చి కోరికలతో అమూల్యమైన జీవితపు విలువలు తెలుసుకోలేక, ఆనాడు అలా ప్రవర్తించాను. అందం, ఐశ్వర్యం అన్నీ తాత్కాలిక మైనవే. వయస్సుతో పాటు అందం కూడా సడలి పోతుంది. ఆ తాత్కాలికమైన దాని కోసం, శాశ్వతమైన అనురాగం, ఆప్యాయత, సంస్కా రం అనే వాటికి దూరమై పోయాను. జీవి తాన్ని గురించి సరైన అవగాహన లేక, నా బతుకుని నేనే చేతులారా సర్వ నాశనం చేసుకున్నాను. కారుంది. అదుగో చూడు. అది ఆమెతో వెళ్ళినప్పుడే వాడాలి. డబ్బుంది. పైసా ముట్టుకోవడానికివీల్లేదు. వచ్చేంత అస హ్యం. కోపం ముంచుకొస్తుంది. ఏమీ చేయ డానికి వీల్లేదు. అమ్మమాట నన్ను కట్టేసి స్తూంది. ఏం చెయ్యను చెప్పు?" కళ్ళ నిండా నీళ్ళ నింపుకున్న వేణూని భుజం తట్టి ఊరుకోబెట్టడం తప్ప ఏం చెయ్యాలో తెలీ లేదు నరేష్‌కి.

ఆ రాత్రి అలకపాన్పు వేసిన సుమతికి జరిగినదంతా చెబితే. ఆమె నోరు తెరిచి "అలాగా! క్షమించండి. నేను అపార్థం చేసు కున్నాను మిమ్మల్ని" అని అతని గుండెల మీద తలపెట్టి పడుకుని, పశ్చాత్తాపంతో అతనిలో ఏకమై పోవాలన్న తపనతో గట్టిగా కౌగిలించుకుంటున్న సుమతి కేసి చూసి, తృప్తిగా నిట్టూర్చి "ఇంతకన్నా ఏం కావాలి?" అనుకుంటూ, ఆమె ఆప్యాయతకి పరవశించి పోతూ, ఆమె బాహువుల్లో నలిగి పోతూ, ఆమెను ముద్దుల్లో ముంచేస్తూ, టేబిల్ లైట్ బటన్ నొక్కి దీపాన్నార్పేశాడు నరేష్. 'చీకట్లో చూడాలి నీ కళ్ళ తళతళలు' అనే ఎంకి పాటను తలుచుకుని పరిరంభ పులక రించిపోతూ!

శారదా అశోకవర్ధన్

కథా రచయితలకు ఆహ్వానం

తెలుగువారి జీవనాన్నీ, సంస్కృతినీ సంఘర్షణనీ ప్రతిబింబించే కథలకు 'ఆదివారం ఆంధ్రజ్యోతి' ఆహ్వానం పలుకుతోంది.

మానవ జీవనంలోని వివిధ కోణాలమీద వెలుగు ప్రసరించే, ఆసక్తి కరమైన కథలకు ప్రాధాన్యత వుంటుంది. కథలు నాలుగు లేక అయిదు అరఠావులకు మించకూడదు. కనీసం 2,500 పదాలకు తగ్గక ఉండాలి!

కథలు ఈ కింది చిరునామాకి పంపించాలి.

ఎడిటర్,
'ఆదివారం ఆంధ్రజ్యోతి' ఆంధ్రజ్యోతి దినపత్రిక,
బంజారా హిల్స్, రోడ్ నెం.3,
హైదరాబాద్- 500 034